నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 22 అక్టోబర్ 2024 | MEDAK

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి: కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 21: పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరేడ్‌గ్రౌండ్‌లో సీపీ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి ముఖ్యఅతిథిగా హాజరై పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. పోలీసులు విపత్కర పరిస్థితుల్లో వారి ఆరోగ్యాన్ని సహితం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. అడిషనల్ డీసీపీలు మల్లారెడ్డి,రామచంద్రారావు, సుభాష్‌చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులకు జ్ఞాపిక బహూకరిస్తున్న సిద్దిపేట కలెక్టర్, సీపీ

బాగారెడ్డి సింగూరుకు పెరిగిన ఇన్‌ఫ్లో

పుల్కల్,అక్టోబర్ 21: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా ప్రాజెక్టులోకి వచ్చే వరద తగ్గడంతో అధికారులు క్రస్ట్ గేట్లను మూసివేశారు. సోమవారం సాయంత్రం ఉన్నట్టుండి వరద ఉధృతి పెరగడంతో అప్రమత్తమై ప్రాజెక్టు ఆరో గేటును ఎత్తి దిగువకు నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2,000 క్యూసెక్కులు వస్తుండగా, అవుట్‌ఫ్లో 3,471క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం జెన్‌కోకు 2,725 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, వృథాగా వెళ్తున్న నీరు 350 క్యూసెక్కులు ఉంటుందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 29.917 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

బోనస్.. బోగస్..!

- సన్న వడ్లకు కొలతలు
- పొడవు, వెడల్పు ఆధారంగా 'సన్నాల' గుర్తింపు
- 2.5 మి.మీ గా ఉంటేనే సన్నరకంగా గుర్తింపు
- రూ.500 బోనస్ ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆవేదన
- మార్కెట్‌లో వ్యాపారులకు అమ్మేందుకు ఆసక్తి

సన్న వడ్లను కొలిచే పరికరాలు



తీసుకువచ్చిన ధాన్యంలోని కొన్ని గింజలు పొట్టు ఒలిచి కొలిచేలా డిజిటల్ డయామీటర్ వంటి పరికరాలు అందుబాటులో తెస్తున్నారు. ఈ నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే బోనస్ చెల్లించనున్నారు. ప్రభుత్వం మద్దతు, బోనస్ కలిపి క్వింటాల్‌కు సన్న వడ్లకు రూ.2800 వరకు ధర చెల్లించనున్నది. కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు పేరుతో కోతలు విధించడంతో పాటు తాజాగా ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.మార్కెట్‌లో సన్నాలకు డిమాండ్ ఉండడంతో గతేడాది తేమతో సంబంధం లేకుండా ప్రైవేట్‌లో వ్యాపారులు సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2300 నుంచి రూ.3200 వరకు ధర చెల్లించారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా రైతులు బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులకు సన్నాలు అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు.

మెదక్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్‌లో పండిన సన్నరకం ధాన్యాన్ని గుర్తించేందుకు అధికారులు కొత్త నిబంధనలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక పరికరం ద్వారా వడ్ల గింజను పొడువు, వెడల్పు కొలిచి, నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే ఆ ధాన్యాన్ని సన్నరకంగా పరిగణలోకి తీసుకోనున్నారు. మెదక్ జిల్లాలో భూములను బట్టి ధాన్యం దిగుబడిలో తేడాలు వస్తాయని, కాంగ్రెస్ ప్రభుత్వం సూచించిన రకాలను సాగుచేసినా కొనుగోలుకు మళ్లీ నిబంధనలు పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. జిల్లాలో రైతులు ఏటా అత్యధికంగా వరి సాగుచేస్తారు. ఆ తర్వాత పత్తి పంట పండిస్తారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2.97 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో సన్నరకం 2,30,964 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 5,19,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో కొనుగోలు కేంద్రాలకు సన్నరకం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 2.80 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. ఇందు కోసం 484 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో సన్నాల సేకరణకు 93 కేంద్రాలు, దొడ్డు రకం వడ్ల కొనుగోలుకు 390 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

2.5 మి.మీగా ఉంటేనే సన్నరకం

మెదక్ జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. ఇప్పటికే పలుచోట్ల పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని గుర్తించేందుకు వీలుగా కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం 33 రకాలను సన్నాలుగా గుర్తించినా.. బియ్యపు గింజ పొడవు 5 మిల్లీమీటర్లు, వెడల్పు 2 మి.మీ, పొడవు వెడల్పుల నిష్పత్తి 2.5 మి.మీగా ఉండాలి. అలా ఉంటేనే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు. లేదంటే దొడ్డు రకం ధాన్యంగా పరిగణించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు

ధాన్యం సేకరణ సజావుగా సాగేనా ?

- గత యాసంగి ధాన్యం సేకరణలో అనేక ఇబ్బందులు
- ప్రస్తుతం వానకాలం సేకరణ సజావుగా చేపట్టాలని రైతుల విజ్ఞప్తి
- సంగారెడ్డి జిల్లాలో 211 సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ప్రత్యేకంగా 26 సన్నబియ్యం కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికే 16 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సంగారెడ్డి,అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభమైంది. వరి కోతలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. మరో రెండు వారాల తర్వాతే వరి కోతలు ఊపందుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 16 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మొదట విడతగా మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వరికోతలు పూర్తిస్థాయిలో ప్రారంభమైన తర్వాత 211 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో గత యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా సాగింది. అధికారుల్లో సమన్వయలోపం,రవాణా, లేబర్, గోదాములు తదితర సమస్యలతో ధాన్యం సేకరణ సజావుగా సాగలేదు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి స్వయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోళ్లు, తరలింపు సజావుగా సాగేలా చూడాల్సి వచ్చింది. యాసంగి(రబీ) సీజన్‌లో ఇబ్బందులు ఎదురైన దృష్ట్యా, గత అనుభవాల నేపథ్యంలో ప్రస్తుత వానకాలం సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ధాన్యం సేకరించాలని రైతులు కోరుకుంటున్నారు.

211 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సంగారెడ్డి జిల్లాలో వానకాలంలో 1,09,415 ఎకరాల్లో వరి సాగుచేశారు. 2.32 లక్షల క్వింటాళ్ల వరి దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేశారు. ఇందులో మార్కెట్‌లోకి 2.11 లక్షల టన్నుల ధాన్యం విక్రయానికి రానుందని, ఆ మేర ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దొడ్డుబియ్యం, సన్నబియ్యం సేకరణకు వేర్వేరుగా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 211 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 101, పీఏసీఎస్ 94, డీసీఎంఎస్ 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 26 సన్నబియ్యం కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవలే మంత్రి దామోదర రాజనర్సింహ శివ్వంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వరి సాగు అధికంగా ఉన్న మరో 15 మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వచ్చేనెల మొదటి వారంలో మిగతా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. 52.77 లక్షల గన్నీ బ్యాగులు, ఏడువేల టార్పాలిన్లు, 183 వెయింగ్ మిషన్లు, 250 తేమ కొలిచే యంత్రాలు అవసరం కానున్నాయి. వీటిని పౌరసరఫరాల శాఖ సమకూరుస్తున్నది. గత యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రవాణా సమస్య తీవ్రంగా ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అంతరాయం కలిగింది. వాహనాల్లో ధాన్యం బస్తాల లోడింగ్‌కు కార్మికులు లేకపోవడం మరింత ఇబ్బందులకు దారితీసింది. అప్పట్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తికి రవాణా కాంట్రాక్టు అప్పగించారు. ఈసారి సైతం అధికార యంత్రాంగం అతనికే రవాణా బాధ్యతలు అప్పగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ కేవలం సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దొడ్డు వడ్లకు రూ.2340, సన్నవడ్లకు రూ.2320 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా దొడ్డు వడ్లు పండిస్తారు. 97వేల ఎకరాల్లో రైతులు దొడ్డు వరి సాగు చేయగా, 2.11 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రానుందని అంచనా. దొడ్డు ధాన్యం ఎక్కువగా ఉన్నందున బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులతో కలిసి సంగారెడ్డి జిల్లా జిన్నారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎకరాకు ఆరువందల గజాల స్థలమివ్వాలి

- లేకపోతే మా భూములు మాకు తిరిగి ఇవ్వాలి
- జిన్నారం, జంగంపేట గ్రామాల రైతుల డిమాండ్
- సంగారెడ్డి జిల్లా జిన్నారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకుల ధర్నా

జిన్నారం, అక్టోబర్ 21: ఎకరాకు ఆరు వందల గజాల స్థలం నష్టపరిహారంగా ఇస్తామని రైతులను ఒప్పించి భూములు తీసుకున్న అధికారులు హెచ్‌ఎండీఏకు అప్పగించి రెండేండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు ఆరు వందల గజాల స్థలం ఇవ్వకపోతే తీసుకున్న భూములు తిరిగి రైతులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జిన్నారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిన్నారం, జంగంపేట గ్రామాల రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రెండు గ్రామాల నాయకులు, రైతులతో కలిసి దాదాపు గంటపాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములు తీసుకున్న సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిన్నారంలోని సర్వేనంబర్ 1001, జంగంపేటలోని సర్వేనంబర్ 376లోని భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేండ్ల క్రితం తీసుకొని హెచ్‌ఎండీఏకు కేటాయించి ఫెన్సింగ్ వేశారని, ఇప్పటివరకు రైతులకు ఆరు వందల గజాల స్థలం మాత్రం ఇవ్వలేదన్నారు. భూములు తీసుకునే సమయంలోనే ఎకరాకు ఆరు వందల గజాల స్థలం ఇస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. అనంతరం తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ చెప్పారు. శ్రీనివాస్‌గౌడ్, మోహన్, బ్రహ్మేందర్‌గౌడ్, నర్సింగ్‌రావు, శ్రీధర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రమేశ్, రాజ్‌కుమార్, అనిల్, నిఖిల్‌గౌడ్, విట్టల్, దుర్గయ్య, పెంటయ్య, భాస్కర్, రాములు, సత్తయ్య, నర్సింహులు, రమేశ్, నీలమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

పిడుగుపడి మహిళ మృతి

తొగుట, అక్టోబర్ 21: పిడుగుపడి మహిళ మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లిలో చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోదనపు లక్ష్మి(50) కుటుంబసభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నది. సోమవారం కులవృత్తి అయిన బండర్లాళ్లను పగులగొడుతున్న సమయంలో మధ్యాహ్నం రెండు గంటలకు కురిసిన వర్షానికి పిడుగుపడి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు తొగుట ఎస్సై రవికాంతారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం..తడిసిన ధాన్యం

నిజాంపేటలో తడిసిన ధాన్యాన్ని దగ్గర చేరుస్తున్న మహిళా రైతు

చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో అకాల వర్షంతో తడిసిన ధాన్యం

నిజాంపేట, అక్టోబర్ 21: మెదక్ జిల్లా నిజాంపేట మండల వ్యాప్తంగా సోమవారం అకాల వర్షం కురిసింది. ఉదయం ఎండ ఉండటంతో రైతులు రోడ్ల వెంబడి, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టారు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిసింది. రైతులు తడిసిన ధాన్యాన్ని నీటి నుంచి వేరు చేశారు. కోతలు ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు అయోమయానికి గురవుతున్నారు.

సిద్దిపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని సేకరిస్తున్న రైతులు

చేతికొచ్చిన పంట నేలపాలు

రామాయంపేట, అక్టోబర్ 21: మెదక్ జిల్లా రామాయంపేటలో భారీ వర్షం కురుస్తున్నది. సోమవారం మధ్యాహ్నం మొదలైన వర్షం రాత్రి వరకు ఏకధాటిగా కురుస్తూనే ఉన్నది. వర్షం ధాటికి పంటచేలన్నీ నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసింది.

కోహెడ మండలంలో..

కోహెడ, అక్టోబర్ 21: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. పిడుగుపడి మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. సుమారు గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న తడిసింది. అకాల వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పత్తి, వరి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతులకు నష్టం కలిగించింది.

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట, అక్టోబర్ 21: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసింది. ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. చేతికి వచ్చిన పంట నేలపాలు అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, అక్టోబర్ 21: ఆరుగాలం చేసిన కష్టం వర్షం పాలైంది. సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి సిద్దిపేట మార్కెట్ యార్డులో ధాన్యం, మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. భారీగా వర్షం పడటంతో వడ్లు కొట్టుకుపోయాయి. ధాన్యం తీసుకువచ్చి నాలుగైదు రోజులైనా కొనే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నేలకొరిగిన వరిపంట

నర్సాపూర్‌లో...

నర్సాపూర్, అక్టోబర్ 21: మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల వరి పంట నేలకొరిగింది. పంట చేతికొచ్చే దశలో వర్షం పడటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

అమరులకు సెల్యూట్ చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, అమరుల కుటుంబాలకు జ్ఞాపికలు బహూకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

అమరుల త్యాగాలు మరువలేనివి

- శాంతి భద్రతలు నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకం
- అమరుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తాం
- అమరుల త్యాగాలను కొనియాడిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, అక్టోబర్ 21: దేశ రక్షణకు పోలీసులు చేసిన త్యాగాలు మరువలేనివని, వారి ప్రాణత్యాగాలతోనే ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల పాత్ర కీలకమని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీసు మైదానంలో స్మృతి పరేడ్ నిర్వహించి, అమరుల స్తూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అమరుల కుటుంబసభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలు బహూకరించారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆధ్వర్యంలో అమరుల కుటుంబసభ్యులతోపాటు కలెక్టర్ క్రాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరుల కుటుంబాలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పోలీసుల సేవలు మనందరి మదిలో చిరస్మరణీయమన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసుశాఖ ముందంజలో ఉన్నదని పోలీసుల సేవలను కొనియాడారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలు చేకూరేలా కుటుంబాల్లో మనోధైర్యం అందించడమే పోలీసు అమరువీరులకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. ప్రజల ధన, మాన ప్రాణ రక్షణకు ఏర్పడ్డ వ్యవస్థ పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతల పరిరక్షణతోపాటు దేశ అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, ఇలా ప్రతి సందర్భల్లోనూ కీలకంగా పని చేస్తున్నదన్నారు. అమరుల త్యాగాలు గుర్తు చేసుకునేందుకు అక్టోబర్ 21న నుంచి 31 వరకు జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ప్రజలకు పోలీసుల సేవలు చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు.

లడక్‌లో జవాన్లు మృతి: ఎస్పీ రూపేశ్

అక్టోబర్ 21, 1959లో సీఆర్‌పీఎఫ్ ఎస్సై కరమ్ సింగ్ నాయకత్వంలోని 20మంది భారత్ జవాన్ల బృందం లడక్ ప్రాంతంలో హాట్‌స్ప్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా చైనా ఆర్మీ దొంగ దాడి చేసి 10 మందిని హతమార్చిందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే)గా నిర్వహిస్తునట్లు వివరించారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన సమస్యలు ఉండేవని, తెలంగాణలో నక్సలిజం ప్రభావం ఎక్కువగా ఉండేదని, ఆ సమయంలో ఎంతో మంది జవాన్లను కోల్పోవడం జరిగిందన్నారు. జిల్లాకు చెందిన నలుగురు వీర జవాన్లు వివిధ ఘటనల్లో నక్సల్స్ , సంఘవిద్రోహ శక్తుల దుశ్చర్యలకు బలిఅయ్యారని ఎస్పీ గుర్తుచేశారు. ఇందులో సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన జంగయ్య, సంగారెడ్డి పట్టణ స్టేషన్‌కు చెందిన ఎల్లయ్య, జిన్నారానికి చెందిన సత్యనారాయణ, కంగ్టి స్టేషన్‌కు చెందిన సురేశ్ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించి వీరమరణం పొందారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ఎస్పీ ప్రార్థించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రామ్ మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ విజయ్‌కృష్ణ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేశ్, జిల్లా ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐలు రామరావ్, రాజశేఖర్, పరేడ్ కమాండర్ డానియెల్, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 21: అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపి అధికారులు సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమమని, సామాన్యులకు అధికారులు అందుబాటులోఉండి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ప్రతిఒక్కరికీ న్యాయం చేసే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 50 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌వో లక్ష్మీకిరణ్, డీఆర్డీవో జయదేవ్‌ఆర్యా, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం మెదక్ ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి వచ్చిన 79 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధితశాఖల అధికారులు పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును సమీక్షించడానికి ప్రత్యేకంగా ప్రతి కార్యాలయంలో ఒక అధికారికి బాధ్యత అప్పగించాలని, ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు వివిధ విభాగాలకు పంపించామని, పరిష్కరించడానికి నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 21: బెస్ట్ అవైలబుల్ పాఠశాల(బీఏఎస్) విద్యార్థుల పెండింగ్ నిధులు విడుదల చేయాలని తెలంగాణ సోషల్ ఫోరం(టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సో